క్లుప్తంగా

అకౌంట్స్ సమావేశం


మాట్లాడుతున్న రామచంద్ర

ఇల్లెందు: ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా అకౌంట్స్‌పై అవగాహన సమావేశం ఏరియా జీఎం కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఏరియా జీఎం ఎం.షాలేమురాజు, డీజీఎం(ఎఫ్అండ్ఏ) బి.రామచంద్ర మాట్లాడుతూ... 2023 ఆర్థిక సంవత్సరం అకౌంట్స్ ముగింపు జరిగిందన్నారు. గనులు, విభాగాలు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం ప్రభాకర్‌రావు, ఏజీఎం గిరిధర్‌రావు, డీజీఎంలు విజయభాస్కర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కొత్తగూడెంరూరల్: కేవీ శేషమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ మారుతి పర్యవేక్షణలో లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చెలక గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మారుతిబాబు మాట్లాడుతూ.. తల్లి పేరుతో ఉచిత వైద్యం అందించాలని తాను చదువుకున్న ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ఉచిత సేవ ఎంతో ఆనందం ఇస్తుందని, పేద ప్రజలకు సేవ చేస్తూ మా అమ్మ ఆకాంక్షను నెరవేస్తున్నట్లు పేర్కొన్నారు. ముందు కూడా పేదలకు వైద్యసేవలు అందిస్తానని తెలిపారు.

ఏప్రిల్ 1న కాంట్రాక్ట్ కార్మికుల మహాసభ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక హక్కుల పరిరక్షణ సంఘం మొదటి మహాసభ ఏప్రిల్ 14వ తేదీన నిర్వహించనున్నామని కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు రాసూరి శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏరియాలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాసూరి మాట్లాడుతూ.. సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక హక్కుల పరిరక్షణ సంఘం దశల వారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించటమే కాకుండా కార్మికులకు యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాలు తలపెడుతున్న మోసపూరిత వాగ్దానాలను ఎండగడుతున్న నేపథ్యంలో సంఘానికి ఆదరణ పెరిగిందన్నారు. ఈ క్రమంలో కార్మికులకు మరిన్ని హక్కులు, సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన మహిళా దినోత్సవ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మహిళలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో మహిళా శిశు సంక్షేమ విభాగం, ఐక్య తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరై మాట్లాడారు. ఐక్య తల్లిదండ్రుల సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న మహిళా సోదరీమణుల సేవలను కొనియాడారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. అనంతరం షీ టీం ఎస్‌ఐ రమాదేవి మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల సంరక్షణ కోసం తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

ఒకటో తేదీ వస్తే ఎదురు చూపులే..

ఇల్లెందు: నెలంతా పని చేస్తే ప్రతినెల 1వ తేదీన అందాల్సిన వేతనాలు ఎప్పుడు అందుతాయో తెలియక ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.జయరాజు అన్నారు. ఆదివారం ఇల్లెందులో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఏ.రాంబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. జయరాజు మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వచ్చినా వేతనాలు అందలేదన్నారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పుడు అలా లేదన్నారు. కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు డీఏ, పీఆర్‌సీ, ఎరియర్స్, జీపీఎఫ్, ఎస్‌ఎల్, మెడికల్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను పట్టించుకోవటం లేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో ముఖ్య భాగమని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయేది ఉద్యోగులేనని పేర్కొన్నారు.

బజారుకెళ్తే భయం భయం..

- పిక్కలు పడుతున్న కుక్కలు
- మండల వ్యాప్తంగా స్వైర విహారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


సుజాతనగర్‌లోని ఓ వీధిలో కుక్కల గుంపు

సుజాతనగర్: మండల వ్యాప్తంగా కుక్కల స్వైర విహారానికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లోని వందలాది కుక్కలు వీధుల్లో తిరుగుతూ పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయి. పిక్కలు పట్టి పీకుతూ ప్రాణాపాయ స్థితి తెస్తున్నాయి. రాత్రివేళల్లో మరింతగా జనంపై ఎగబడుతున్నాయి. చిన్న పిల్లలను చూస్తే చాలు వెంటాడుతున్నాయి. చిన్నారులు చేతుల్లోని ఆహార పదార్థాలు లాగేసుకుంటున్నాయి. అందకుంటే వెంటబడి మరీ అందిపుచ్చుకుంటున్నాయి. కుక్కల దాడితో బాధితులు టీకాల కోసం ప్రభుత్వాస్పత్రుల వద్దకు పరుగెడుతున్నారు.

జంతు వ్యర్థాల రుచి మరిగి..

గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల దుకాణాల యజమానులు వ్యర్థాలను ఊరి బయట పడేస్తున్నారు. వీటి రుచి మరిగిన కుక్కలు.. నిత్యం మనుషులు, పశువులు, పెంపుడు కోళ్లను వేటాడుతున్నాయి. చీకట్లో వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులను సైతం వదలడం లేదు. కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలకు కుక్కలు అడ్డు తగులడంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో వీటి సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

పట్టించుకోని యంత్రాంగం..

గ్రామాల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. ఏళ్ల తరబడి వీటిని అరికట్టేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రజలకు ప్రాణాపాయంగా మారిన కుక్కలను పట్టి అడవుల్లో వదిలేయడం లేదు. ఒకటి రెండు చోట్ల స్థానికులు కుక్కలను పట్టించినా వాటిని ఊరి బయటనే వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా సర్పంచులు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే సాధారణ విషయంగా వదిలేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదు.

మూడేళ్లలో 722 మంది బాధితులు..

సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రి పరిధిలో గడిచిన మూడేళ్లలో 722 మంది కుక్కకాటుకు గురయ్యారు. 2021లో 331 మంది, 2022లో 317, 2023లో ఇప్పటి వరకు 74 మంది కుక్కకాటుకు గురయినట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల ఒక్కరోజే సుజాతనగర్, బేతంపూడి గ్రామాల్లో ఇద్దరు చిన్నారులు కుక్కకాటుకు గురయ్యారు. తప్పించబోయిన పెద్దలపైకీ కుక్కలు ఎగబడ్డాయి. సర్వారం గ్రామానికి చెందిన భూక్యా రాజేష్, వాణి దంపతుల కుమారుడు మోక్షిత్ నాయక్ ఇటీవల ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ఓ పిచ్చికుక్క చిన్నారిపై ఎగబడి తీవ్రంగా గాయపరిచింది. తల్లి వచ్చి విడిపిస్తున్న క్రమంలో ఆ కుక్క చిన్నారి తల్లిని సైతం కరిచింది. చిన్నారి తలకు 9 కుట్లు పడగా.. పెదవులకు ప్లాస్టిక్ సర్జరీ చేయాల్సి వచ్చింది.


దుకాణాల వద్ద సంచరిస్తున్న కుక్కలు

కుక్కలను నియంత్రించాలి



సుజాతనగర్‌లో వీధి కుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నాయి. వాటిని చూస్తే ప్రజలు భయపడుతున్నారు. పిల్లలు, పెద్దలు భయపడాల్సి వస్తోంది. తక్షణమే వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– కె.తిరుపతయ్య, సుజాతనగర్

భయపడక తప్పడం లేదు



కుక్కలు గుంపులుగా వీధుల్లో తిరుగుతుండటంతో భయపడాల్సి వస్తోంది. రాత్రిపూట భయటకు రావాలంటేనే వణుకు పుడుతోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు భయంభయంగా వెళుతున్నారు. వెంట పెద్దలు వెళ్లాల్సిన పరిస్థితి.

– గూని శ్రీనివాసరావు, సుజాతనగర్

చర్యలు తీసుకుంటాం



కుక్కలను చంపేందుకు మాకు ఎలాంటి అధికారం లేదు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటి సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు వివిధ పనుల నిమిత్తం బజారుకు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడాలి


సుజాతనగర్‌లో సంగ్రామ యాత్ర

సుజాతనగర్: ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీకి ప్రతిఘటన తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి అన్నారు. ఎస్సీల వర్గీకరణపై కేంద్రప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర ఆదివారం సుజాతనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగల వర్గీకరణపై నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. ఏప్రిల్ 4న జరిగే హైదరాబాద్ ముట్టడికి మాదిగలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎక్కువ జనాభా ఉన్న మాదిగలు బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమణయ్య, కూరపాటి సునీల్, కనకం రవి, రాజా పెరియార్, నల్లట్ల వెంకన్న, కృష్ణ, కొప్పుల తిరుపతి, కాంతారావు, గుర్రం నాగమణి, మేకల లత, మిరియాల రమాదేవి, సమ్మక్క పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళలతో నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షీ టీం ఎస్సై రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు సందర్భంగా కల్యాణ్ సుమిత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ వారు లిరిక్ రైటర్‌గా.. సింగర్‌గా దర్శకత్వం వహించిన ఓ మహిళ వీడియో సాంగ్ టైటిల్ పోస్టర్‌ను ఆదివారం ఎస్సై ఆవిష్కరించి మాట్లాడారు. మహిళ సమాజంలో అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా అన్ని రకాలుగా పాత్రను పోషిస్తూ వివిధ రంగాల్లో రాణిస్తోందన్నారు.

మహిళ తనకు అవసరం అనుకున్నప్పుడే పోరాడుతుందని, తాను అన్నింట్లో సమానంగా ఉందని ఈ సాంగ్ ద్వారా మహిళల గొప్పతనాన్ని వివరించారని అభినందించారు. కార్యక్రమంలో కల్యాణ్ సుమిత్ర పాల్గొన్నారు.

నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో..

కొత్తగూడెం నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబురాలు నిర్వహించారు. ఫౌండర్ మల్లెల ఉషారాణి మాట్లాడుతూ.. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, కానీ మహిళల రక్షణ కొరకు ఎన్ని చట్టాలు ఉన్నా విఫలమవుతున్నాయన్నారు. మహిళలపై దాడులు జరగకుండా పోలీసు వ్యవస్థ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం 30 మంది వివిధ సంఘాలలో పని చేస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో నాగమణి, సీడీపీఓ కనక దుర్గ, ఎంపీటీసీ పద్మ, చల్లా శకుంతల, సుమ భాను, మునీలా, మాధవీలత, కొచ్చెర్ల రాణి, గాయత్రి, సృజన తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాలు కలిపిన భక్తులు


కల్యాణానికి తలంబ్రాలు కలుపుతున్న భక్తులు


పసుపు కొడుతున్న దృశ్యం

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం (గుట్ట)పై ఈ నెల 17వ నుంచి 20వ తేదీ వరకు జరిగే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం పునస్కరించుకుని తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 18న కల్యాణం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేశ్ శర్మ, అర్చకులు ఫణిరాజ చార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. వందలాది మంది మహిళా భక్తుల ఆధ్వర్యంలో పసుపుకొట్టి, తలంబ్రాలు కలిపారు. అదేవిధంగా కల్యాణ మహోత్సవ కరపత్రాలను జిల్లా మెడికల్ ఆఫీసర్ జె.శిరీష ఆవిష్కరించారు. వీడియో టీజర్‌ను శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి గౌరవ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి.నర్సింహాకుమార్, పిట్టా లక్ష్మీరెడ్డి, తాటికొండ శ్రీలత, విజయలక్ష్మి, సత్యవతి, కళావతి, లక్ష్మి, సంఘమిత్ర, ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురి రాము, ఊకె భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, బండి నారాయణ, వేముల వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, కంతాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు గణేష్ టెంపుల్ హుండీ లెక్కింపు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గత ఐదు మాసాల నుంచి వచ్చిన హుండీ ఆదాయాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి కే.సులోచన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఎండోమెంట్ పర్యవేక్షణలో, ఆలయ రెనోవేషన్ కమిటీ, సేవా సమితి, భక్తుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

స్వచ్ఛోత్సవ్‌లో పాల్గొనండి


మాట్లాడుతున్న అంకుషావలి

ఇల్లెందు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛోత్సవ్ – 2023 ఉత్సవాల్లో పాల్గొనేందుకు మహిళలను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంకుషావలి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పబ్లిక్ / కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ సేవలు, మున్సిపల్ వేస్ట్ సేకరణ, రవాణా, వేస్ట్ టూ వెల్త్ ఉత్పత్తులు, సాలీడ్ వేస్ట్ నిర్వహణ, ఐఈసీ, ట్రెనింగ్, సాంకేతికం, ఆవిష్కరణలు వంటి కార్యక్రమాలలో పట్టణ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనపర్చిన ఐదుగురు మహిళలు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక అవుతారని తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 5 వరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారికి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బోర్‌వెల్ లారీ సీజ్


తహసీల్‌లో సీజ్ చేసిన బోర్‌వెల్ లారీ

పాల్వంచ: అనుమతి లేకుండా బోర్ వేస్తుండటంతో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాలు.. ఆదివాకం ఉల్వనూరు రెవెన్యూ పంచాయతీలో ఓ పొలంలో అనుమతి లేకుండా బోర్ వేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తహసీల్దార్ రంగాప్రసాద్ ఆదేశాల మేరకు రూరల్ ఆర్‌ఐ హచ్చా సంఘటనా స్థలానికి వచ్చి అడ్డుకున్నారు. రామాంజనేయ బోర్‌వెల్‌ను సీజ్ చేసి తహసీల్‌కు తరలించారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

టేకులపల్లి: మద్రాస్ తండా గ్రామానికి చెందిన భూక్యా ద్వాళి(50)కి సంతానం లేరు. కొన్నేళ్ల క్రితమే భర్త మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తూ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఎవరూ లేకపోవడంతో గ్రామ పంచాయతీ తరపున సర్పంచ్ మాళోతు రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


కొత్తూరులో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. ఆదివారం పాపకొల్లు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వయా కొత్తూరు మీదుగా రాజారావుపేట క్రాస్ రోడ్డు వరకు, మాచినేనిపేటతండా నుంచి బాడవబోడు వరకు ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ 2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మాచినేనిపేటతండాలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో పొలాలకు వెళ్లే డొంక రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సీఎం కేసీఆర్‌కు అందజేయడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు చెప్పారు. రైతుల అభివృద్ధి కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలు, వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా ఉచిత కరంటు అందిస్తున్నామన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది దేశంలో తెలంగాణ రాష్ట్రమేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని, మూడోసారి కూడా కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. అనంతరం 16 మంది లబ్ధిదారులకు రూ 5.31 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, ఐటీడీఏ ఏఈ ప్రసాద్, ఎంపీటీసీలు బానోత్ స్వాతి, బానోత్ నీల, సర్పంచ్‌లు బూరం వెంకటలక్ష్మి, లావుడ్యా కిషన్‌లాల్, బానోత్ శాంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను ఎండగట్టాలి..


మాట్లాడుతున్న రేపాకుల శ్రీను

ఇల్లెందు: రైతు, కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని ఎండకట్టాలని సీపీఎం జిల్లా నేతలు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీను, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన వ్యవసాయ కార్మిక, సంఘం, సీఐటీయూ, రైతుసంఘం మండల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచీ పరిచి రూ.12 లక్షల కోట్లు ఎగ్గొట్టిన బడాబాబులు అదానీ, అంబానీలకు అనుకూలంగా వ్యవహరించిన మోదీ విధానాల వల్ల వినాశనం తప్పదన్నారు. పేద రైతులు, కార్మికులు, కర్షకులకు ఇచ్చిన రుణాన్ని ఇవ్వాలని నిర్బంధించడంచ ముక్కు పిండి వసూలు చేయటం పరిపాటిగా మారిందన్నారు. నిత్యావసరాల ధరలు పెంచడం, ఎన్నికల పేరుతో కులమతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను అవలంబిస్తున్నారని, మోదీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహార్యాలీని మూడు సంఘాల ఆధ్వర్యంలో జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, రాందాస్, సుల్తానా, మరియా, కూకట్ల శంకర్, రాజు, ఈర్యా నాయక్, వీరభద్రం, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా నిరంతర పోరాటాలు



మాట్లాడుతున్న జనార్దన్

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలపై నిరంతర పోరాటాలు సాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. ఆదివారం స్థానిక వర్తక సంఘ భవనంలో జిల్లా ఏడో మహాసభను నిర్వహించారు. ముందుగా ఐఎఫ్‌టీయూ జెండాను జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అమరవీరులకు సంతాపం తెలిపారు. జనార్ధన్ మాట్లాడుతూ.. 1978 గౌహతి ఉద్యమాల నుంచి నేటి నరేంద్రమోదీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేఖిస్తూ ఉద్యమాలను కొనసాగిస్తునే ఉన్నామన్నారు. పాలకవర్గాలు ప్రపంచీకరణ పేరుతో కార్పొరేట్ శక్తులకు కార్మిక హక్కులను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. కార్మిక లోకం ఐక్యంగా ఉద్యమిస్తేనే హక్కులు కాపాడుకోగలుగుతామన్నారు. గ్రామపంచాయతీల్లో, మున్సిపాలిటీలు, పాఠశాలలు, సింగరేణి, కేటీపీఎస్ వంటి సంస్థల్లో కాంట్రాక్ట్ వర్కర్లు నేడు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో కె.సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, ఏదులాపురం గోపాలరావు, యాసారపు వెంకన్న, కోటిలింగం, వెంకన్న, సామేల్, వీరన్న, రమేష్, మల్లయ్య, మంకేన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం జూలూరుపాడులో బీఆర్‌ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పొన్నెకంటి సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉండటం మహిళల దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో లావుడ్యా సోనీ, భూక్యా కళావతి, ఎదళ్లపల్లి వీరభద్రం, లావుడ్యా కిషన్ లాల్, ధరావత్ రోజా తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందుకు పూర్వ వైభవం


జోడోయాత్రలో చేపలు తూకం వేస్తున్న నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లెందుకు పూర్వవైభవం వస్తుందని సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సాధ్యం అవుతుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అన్నారు. 4వ వార్డులో ఆదివారం ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. పట్టణంలో అనేక మంది పేదలు సొంతింటి కల నెరవేరక అద్దె ఇళ్లల్లో కాలం గడుపుతున్నట్లు చెప్పారు. నాటి కాంగ్రెస్ పాలనలో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పట్టణంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేశామని, రైతులకు ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంటు, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించిన ఘనత కూడా నాటి సీఎం వైఎస్‌ఆర్‌కే దక్కిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డానియేల్, పులి సైదులు, ప్రవీణ్, సుదర్శన్ కోరీ, ఐజాక్, సైదుమియా, లింగంపల్లి శ్రీనివాస్, మసూద్, కంచర్ల శ్రీనివాస్, ఆరెం కిరణ్, వల్లాల రాజయ్య, నిర్మల, మున్నా, సలీం పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో?

టేకులపల్లి మండలం సింగ్యా తండా నుంచి హనుమాతండా వరకు సుమారు మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డుకు స్థానిక గిరిజనులు నోచుకోవడం లేదు. టెండర్ పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు పని అప్పగిస్తే కల్వర్టు పనులు చేసి వెళ్లిపోయాడు. ఈ రోడ్డు మధ్యలో మూడు ట్రాక్టర్ ట్రక్కుల కంకర, సిమెంట్ మిక్సింగ్ కుప్పలు వేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. బీటీ రోడ్డు వేయకపోగా, రోడ్డు మధ్యలో కంకర ఉండడంతో రైతులు, ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే బీటీ


నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : సలార్, ఐటీడీఏ ఏఈ , టేకులపల్లి
సెల్ నంబర్ : 9701619970